ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 323 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 1 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# పనిచేసిన వారికి
# పదవులు ఇస్తాం



పనిచేయని వారి పదవులు ఊడబెరుకుతాం
రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి రక్ష
కష్టపడ్డవారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది
పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):** పదవులు రాలేదని కాంగ్రెస్ నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా పదవులు వస్తాయన్నారు. రాహుల్ గాంధీని ప్రదాని చేయడమే లక్ష్యంగా అంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ భవన్ లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ కొత్త ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ తో పాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.నాలుగైదేళ్లు జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చాం. పార్టీలో నమ్మకంగా ఉన్నవారికి ఉన్నత పదవులు ఇచ్చాం. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నాం. మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫీడ్‌బ్యాక్ తీసుకొని పదవులు ఇస్తాం. ప్రస్తుతం రెండేళ్ల కాలానికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. మార్చి 10 లోపు జిల్లాల వారీగా ఇన్‌ఛార్జి మంత్రులు నామినేటెడ్ పదవులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే వరకూ మనం విశ్రమించొద్దన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవద్దు. రాహుల్ ప్రధాని అయితే, దేశం అభివృద్ధి అవుతుంది. కాంగ్రెస్‌కు తక్కువ.. ఎక్కువ.. అనే తారతమ్యాల్లేవు. అనుభవజ్ఞులైన ఇద్దరిని ఇప్పటికే రాజ్యసభకు నామినేట్ చేశాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. రాష్ట్రంలో కులగణన అనేది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే అత్యధిక పన్నులు కడుతున్న రాష్ట్రం తెలంగాణ. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు ఇవ్వాల్సిన బాధ్యత పార్టీపైనే ఉంటుందని అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది అని తెలిపారు. పని చేసిన వారి జాబితాను కొత్త ఇంఛార్జ్ సిద్ధం చేస్తారు.. కొందరికి పదవులు రాలేదు.. మొదటి విడతలో కార్పొరేషన్ ఛైర్మన్లు రెండేళ్లు అవకాశం ఇచ్చాం.. పని తీరు సరిగ్గా లేని వారిని కొనసాగించామని పేర్కొన్నారు. ఇప్పుడు ఏం అనను.. రెన్యువల్ కోసం వస్తారు కదా అప్పుడు చెప్తానని తెలిపారు. పదవి వచ్చింది కదా అని కూర్చున్న వాళ్లకు కొనసాగింపు ..మిగతా 2లో



# టన్నెల్ ఘటన
# విషాదాంతం

## ఏ ఒక్కరూ మిగల్లేదు
### ఆరు మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది!

**శ్రీశైలం, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):** నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట వద్ద శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది మరణించారు. అధునాతన పరికరాలు, రాడార్‌లను ఉపయోగించి మూడు మీటర్ల లోతులో మృతదేహాలు ఉన్నట్లు రెస్క్యూ టీమ్ గుర్తించింది. వీరిలో ఆరుగురి డెడ్ బాడీలను శుక్రవారం అర్ధరాత్రి వెలికితీసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. టన్నెల్‌లో చిక్కుకుని మొత్తం 8 మంది చనిపోయారు. వీరిలో ఇద్దరు కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు ఉన్నారు. వీరిలో ఆరుగురి మృతదేహాలను వెలికితీయగా.. మిగిలిన రెండు డెడ్ బాడీలను బయటకు తీసేందుకు రెస్క్యూ టీమ్ ప్రయత్నిస్తోంది. శనివారం ఉదయం వరకు రక్షణ చర్యలను ముగించి, ఆ వివరాలను ప్రకటించే అవకాశం ఉంది. సొరంగంలో 8 మంది కార్మికులు చిక్కుకున్న ఏడు రోజుల తర్వాత.. చివరకు వారి మృతదేహాలను రెస్క్యూ టీం గుర్తించింది. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉంటే 8 మంది కార్మికులు ప్రాణాలతో బయటపడేవారని పలువురు నాయకులు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం పట్ల రేవంత్ సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ఓ పక్క ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం చోటు చేసుకుంటే.. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఎలక్షన్ ప్రచారంలో బిజీగా గడిపిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి రాకపోవడంతో సహాయక చర్యల్లో ..మిగతా 2లో

# మామునూరు ఎయిర్‌పోర్టుకు రెక్కలు
### విమానాశ్రయ విస్తరణకు కేంద్రం ఆమోదం
### ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):** వరంగల్ నగర ప్రజలకు కేంద్రం శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎయిర్‌పోర్ట్ కలనినెరవేర్చింది. వరంగల్ జిల్లాలోని మామూనూర్‌లో విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి ఇవ్వడంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండ సురేఖ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.శంషాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో మరో ఎయిర్‌పోర్టు ఉండరాదని జీఎంఆర్ సంస్థ గతంలో ఒప్పందం చేసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం, రామ్మోహన నాయుడు జరిగిన చర్చల తర్వాత జీఎంఆర్ సంస్థ కూడా ఎలాంటి అభ్యంతరం ..మిగతా 2లో



# కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువే
### విభేదాలు అన్నవి ఉత్తిమాటలేనన్న మీనాక్షి
### లేక్‌వ్యూలో మీనాక్షిని మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):** పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవు.. మా పార్టీలోనే ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందని కాంగ్రెస్ పార్టీ కొత్త ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. తెలంగాణలో పనిచేసే అవకాశం వచ్చింది.. పీసీసీ చీఫ్, సీఎం, ఇతర నేతలు, కార్యకర్తలను కలుపుకొని పనిచేస్తానన్నారు. పార్టీ పటిష్టతకు, రాజ్యాంగ పరిరక్షణకు అందరం కలిసి పనిచేస్తామన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లధానికి కృషి చేస్తాననన్నారు. శుక్రవారం ..మిగతా 2లో





# మూడు రాష్ట్రాల్లో
# హిమపాతం
### మంచుతో కప్పకుపోయిన రోడ్లు
### ఉత్తరాఖండ్‌లో మంచు చరియల కింద 57 మంది కార్మికులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం): దేశంలోని మూడు రాష్టాల్లో భారీగా మంచు కురుస్తోంది. జమ్ముకశ్మీర్ , హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ లలో మంచు తీవ్రంగా ఉన్నది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఎక్కడ చూసినా మంచు దిబ్బలే దర్శనమిస్తున్నాయి. కనుచూపుమేర ..మిగతా 2లో

## 6న తెలంగాణ
# కేబినెట్ భేటీ
### పలు కీలక అంశాలపై చర్చ



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మార్చి 6వ తేదీన నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో రెండో దఫా కులగణన నిర్వహించిన నేపథ్యంలో వాటికి సంబంధించిన గణాంకాలపై కేబినెట్ చర్చించనుంది. అలాగే బిసిలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు మార్చిలో ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపరుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ అంశాలపై కూడా మంత్రి మండలి చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. అలాగే రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు.







# పనిచేసిన వారికి పదవులు ఇస్తాం

మొదటి పేజీ తరువాయి...

ఉండదని సీఎం రేవంత్ తేల్చి చెప్పారు. ఇక, మార్చి 10వ తేదీ లోపు ఇంఛార్జ్ మంత్రులు జిల్లాకు వెళ్ళండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదాయ కమిటీలు, మార్కెట్ కమిటి డైరెక్టర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి.. వాటికి సంబంధించిన జాబితా సిద్ధం చేయండి.. అందరికీ పదవులు ఇచ్చేద్దాం.. అలాగే, పదవులు వచ్చిన వాళ్ళు.. పదవి వచ్చింది నేను ఎందుకు పని చేయడం అనుకుంటున్నారు.. పదవి రాని వారు, పదవి రాలేదు కదా నేననేందుకు పని చేయడం అని అనుకుంటున్నారు.. మంచిని మైక్ లో చెప్పండి.. ఇక, పార్టీ నాయకులకు నా విజ్ఞప్తి.. ఏదైనా సమస్య అంటే చెవిలో చెప్పండి అన్నారు. గుజరాత్ మోడల్ సక్సెస్ మోడల్ కాదు.. ఆయన ప్రమోట్ చేసుకున్నారు.. టాక్స్ కలెక్షన్ లో తెలంగాణ నే టాప్.. ఆరో ప్లేస్ లో గుజరాత్ ఉంది.. విదేశీ పెట్టుబడులు తెచ్చింది తెలంగాణ.. వరి ధాన్యం పండించిన మొదటి రాష్ట్రం తెలంగాణ.. కాళేశ్వరం లేకుండానే కోటి 56 లక్షల టన్నులు పండించామని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. అలాగే, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు కసి తగ్గొద్దు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మేము కష్ట పడుతున్నాం.. మీరంతా కష్ట పడాలన్నారు. అనుకూల వాతావరణం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడండి అని చెప్పుకొచ్చారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు అందరు అక్కడికి వెళ్లారు.. రెస్క్యూ ఆపరేషన్ ను మంత్రులు దగ్గరుండి మరి పరిశీలించారు అని చెప్పారు. ఇక, కాస్మటిక్ చార్జీలు కేసీఆర్ పెంచలేదు.. మనం పెంచాము అని రేవంత్ రెడ్డి తెలిపారు.



# 2న నగరంలో ఉపరాష్ట్రపతి పర్యటన

## భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):** మార్చి 2వ తేదీన రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధనకడ్ పర్యటిచనున్నారు. ఈ సందర్భంగా తగిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. కాగా ఉపరాష్ట్రపతి హైదరాబాద్‌లోని ఐఐటిని సందర్శించి అక్కడి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటిస్తారని సిఎస్ తెలియజేశారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కూడా పాల్గొని అదే రోజు తిరిగి న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సి.ఎస్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వైద్యారోగ్య శాఖకు అర్హులైన వైద్యులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖకు చెప్పారు. ఈ సమావేశంలో హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్ హరీష్, హైదరాబాద్, సంగారెడ్డి కలెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.



# యువత శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి: రాజ్‌నాథ్‌సింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):** శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు నిచ్చారు. గ్లోబల్ లీడర్ షిప్‌లో యువతదే కీలక పాత్ర అని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని విజ్ఞాన్ వైభవ్–2025ను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సైన్స్ అండ్ టెక్నాలజీలో వచ్చే మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో భారత్ అగ్రగామిగా మారుతోందని చెప్పారు. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో భారత్ అగ్రగామిగా మారుతోందని చెప్పారు.

# రూ.3.22 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్

- రెవెన్యూ వ్యయం రూ.2,51,162 కోట్లు
- మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు
- రెవెన్యూ లోటు రూ. 33,185 కోట్లు
- ద్రవ్య లోటు రూ.79,926 కోట్లుగా అంచనా
- నైపుణ్యాభివృద్ధి శిక్షణశాఖకు రూ.1,228 కోట్లు
- పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు
- ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు
- ఎస్సీల సంక్షేమానికి రూ.20,281 కోట్లు
- ఎస్టీల సంక్షేమానికి రూ.8,159 కోట్లు
- బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు
- అల్పసంఖ్యాక వర్గాల కోసం రూ.5,434 కోట్లు
- మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమానికి రూ..4,332 కోట్లు
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు
- పంచాయతీ రాజ్ శాఖకు రూ.18,847 కోట్లు
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు
- గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు
- జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు
- ముంబై, హైదరాబాద్‌లకు దీటుగా అమరావతి
- గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం
- అదో డ్రాపవుట్ ప్రభుత్వం అంటూ ఎద్దేవా
- తొలిసారిగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి పయ్యావుల



**అమరావతి, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం):** రూ.3.22 లక్షల కోట్లతో ఏపీ శాసనసభలో 2025–26 వార్షిక బడ్జెట్‌ను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో వ్యవసాయానికి రూ.48వేల కోట్లు కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ.2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు, రెవెన్యూ లోటు రూ. 33,185 కోట్లు, ద్రవ్య లోటు రూ.79,926 కోట్లుగా అంచనా వేశారు. అన్నదాత సుఖీభవ కోసం రూ.6,300 కోట్లు,పోలవరం ప్రాజెక్టు కోసం రూ.6,705 కోట్లు కేటాయించారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి పయ్యావుల మాట్లాడుతూ.. రాష్ట్ర రుణ సామర్థ్యం సున్నాకు చేరుకుందని.. అప్పు తీసుకొనే శక్తి లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ మిగిలిందని అన్నారు. అయినప్పటికీ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. 2014–19 మధ్య రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించిందన్నారు. సవాళ్లను ఎదుర్కోవడంలో చంద్రబాబు.. ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. రాష్ట్ర విభజన కారణంగా రాజధాని ని కోల్పోయిన ఏపీకి అమరావతిని ప్రజా రాజధానిగా చేసుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణం గా అమరావతి పనులు పెద్దఎత్తున చేపడతామని చెప్పారు. మహారాష్ట్రకు ముంబయి, తెలంగాణకు హైదరాబాద్ ఎంత ముఖ్యమో.. మనకూ అమరావతి అంతే ముఖ్యమన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ముంబయి, హైదరాబాద్ నగరాలకు సరితూగేలా అమరావతిని అభివృద్ధి చేస్తామని పయ్యావుల వెల్లడించారు. తన ప్రసంగంలో మొదట గత పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని వివరించిన మంత్రి పయ్యావుల కేశవ్ ,ఆ తరువాత రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలను వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల రాష్ట్రం ఏ మేరకు నష్టపోయిందో, అభివృద్ధిలో ఎలా తిరోగమనం చెందిందో తెలిపారు. ఇదిలా ఉండగా.. తన బడ్జెట్‌ప్రసంగంలో డ్రాప్ అవుట్స్ కాన్సెప్ట్‌తో ఆకట్టుకున్నారు మంత్రి. గత ప్రభుత్వంలో స్కూళ్లల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్సే కాదు.. చాలా రంగాల్లో డ్రాప్ అవుట్స్ జరిగాయన్నారు. పరిశ్రమలు డ్రాప్ అవుట్ అయ్యాయని.. రాష్ట్రం నుంచి ఉద్యోగాలు డ్రాప్ అవుటయ్యాయని... పేదలకు ఉపాధి డ్రాప్ అవుట్ అయిందని వెల్లడించారు. గత ప్రభుత్వ పాలకులు ఇప్పుడు ఓటమితో.. సభకు రాకుండా.. అసెంబ్లీ నుంచి కూడా డ్రాప్ అవుట్ అయ్యారని సెటైర్ విసిరారు. వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు ప్రజా జీవితం నుంచి శాశత్వంగా డ్రాప్ అవుట్ అయ్యే రోజులు అతి త్వరలోనే ఉన్నాయంటూ పయ్యావుల కేశవ్ ఛలోక్తులు విసిరారు. అలాగే బడ్జెట్ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోడీ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పేర్లను మంత్రి ప్రస్తావించారు. ఆయా సందర్భాల్లో వారు మాట్లాడిన కామెంట్లను.. తీసుకుంటున్న చర్యలను ప్రసంగంలో తెలిపారు. చెత్త పన్నుపై అయ్యన్న కామెంట్లు గుర్తు చేయడంతో అప్పటి అయ్యన్న కామెంట్లను సభ్యులు చర్చించుకున్నారు.స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపక్షంలో ఉండగా చెత్త పన్ను వేసిన గత పాలకులపై చేసిన కామెంట్లు సంచలనం సృష్టించాయని మంత్రి తెలిపారు. అప్పులనే కాదు.. చెత్తను వారసత్వంగా ఇచ్చింది గత ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. చెత్త పన్ను వేయడమే కాకుండా.. 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఎత్తకుండానే వైసీపీ ప్రభుత్వం వెళ్లిపోయిందంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు. అలాగే స్వర్గీయ ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రూ. 2కే కిలో బియ్యం పథకం గురించి కూడా పయ్యావుల బడ్జెట్‌లో ప్రస్తావించారు. కాలే కడుపునకు పట్టెడన్నం పెట్టేందుకు ఎన్టీఆర్ రూ. 2కే కిలో బియ్యం పథకం ప్రారంభిం చారని గుర్తుచేశారు. ఆ సంక్షేమ పథకమే జాతీయ స్థాయిలో చట్టంగా మారిందని... అదే ఆహర భద్రత చట్టమని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఇకపోతే బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా ఉన్నాయి. నైపుణ్యాభివృద్ధి శిక్షణశాఖకు రూ.1,228 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు,ఎస్సీల సంక్షేమానికి రూ.20,281 కోట్లు,ఎస్టీల సంక్షేమానికి రూ.8,159 కోట్లు, బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు, అల్పసంఖ్యాక వర్గాల కోసం రూ.5,434 కోట్లు, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు రూ.18,847 కోట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు, గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ.3,156 కోట్లు,ఇంధన శాఖకు రూ.13,600 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.8,785 కోట్లు,యువజన, పర్యటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు, గృహ మంత్రిత్వ శాఖకు రూ.8,570 కోట్లు, తెలుగు భాష అభివృద్ధి, ప్రచారం కోసం రూ.10 కోట్లు, మద్యం, మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రం కోసం నవోదయ 2.0 కార్యక్రమానికి రూ.10 కోట్లు, జల్ జీవన్ మిషన్ కోసం రూ.2,800 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,487 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.3,806 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9,407 కోట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం రూ.27,518 కోట్లు,ఆర్టీజీఎస్ కోసం రూ.101 కోట్లు, దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు, మత్స్యకార భరోసాకు రూ.450 కోట్లు, స్వచ్ఛాంధ్ర కోసం రూ.820 కోట్లు,డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.3,486 కోట్లు, ఆదరణ పథకానికి రూ.1000 కోట్లు కేటాయింపులు చేశారు.

# కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువే

మొదటి పేజీ తరువాయి...

లేక్‌వ్యూలో బసలచేసిన ఆమెను సీఎం రేవంత్, మంత్రి పొన్నంలు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో అంతర్గత రాజకీయాలు లేవు..ప్రజాస్వామ్యం కాంగ్రెస్ లో ఎక్కువ..పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయి.. అందరి అభిప్రాయాలకు సముచితస్థానం కల్పిస్తూ ముందుకెళ్తామన్నారు. తెలంగాణను సోనియా గాంధీ ఏ ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారో..ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఇక కొత్త ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ చాలా సాదా సీదా వ్యక్తి. దిల్ కుష్ తో కార్యాలయ బయట కార్యకర్తలను కలిసి విష్ చేశారు. బొకేలు ఇస్తుంటే నిరాకరించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ బ్రహ్మచారిణి. చాలా సాదా సీదాగా ఉంటారు. అత్యవసర మీటింగులకు, రాహుల్ ఇతర రాష్టాల్లో ఉన్నప్పుడు అత్యవసర పిలుపు వస్తే మినహా ఆమె విమాన ప్రయాణం చేయరని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఆమె ఇడ్లీయే ఆమె బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ అని తెలుస్తోంది. కేవలం రెండు జతల బట్టలే వాడుతారని అంటున్నారు. స్వాగతాలు, సన్మానాలు, బొకేలకు చాలా దూరంగా ఉంటారు. శనివారం మౌన వ్రతం పాటిస్తారు. గాంధేయ సిద్దాంతంలో భాగం. ఆ రోజు ఎవరితో మాట్లాడరని, కేవలం సంజ్ఞలతోనే నడిపిస్తారని అంటున్నారు. కాన్వాయ్ ప్రయాణానికి దూరం సాధారణంగా ఆమె ఆటోలో వెళ్లేందుకు ప్రయార్టీ ఇస్తారు. ఎక్కడైనా రాత్రి బస చేయాల్సి వస్తే సొంత ఖర్చులతో మాజీ ఎంపీ హోదాలో ప్రభుత్వ అతిథి గృహంలో ఉంటారు. ఈ నేపథ్యంలో ఇవ్వాళ రాత్రి కూడా



దిల్ కుశా గెస్ట్ హౌస్ లో ఆమె బస చేయనున్నారు. ఇందుకోసం ఆమె నేరుగా ఆన్ లైన్ లోనే రూ. 50 చెల్లించి ఓ గదిని బుక్ చేసుకున్నారు. గ్రూప్ మీటింగులు తప్ప పర్సనల్ మీటింగ్స్ కు దూరం. సమయ పాలన కచ్చితంగా పాటిస్తారు.

# మూడు రాష్ట్రాల్లో హిమపాతం

మొదటి పేజీ తరువాయి...

శ్వేత వర్ణం అలుముకుంది. అక్కడ రోడ్లన్నీ శ్వేతవర్ణాన్ని తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా హిమపాతం పేరుకుపోవడంతో అధికారులు పలు రహదారుల్ని మూసివేశారు. జమ్ముకశ్మీర్‌లో ఎడతెరిపిలేకుండా మంచు కురుస్తోంది. దీంతో చాలా ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. అప్రమత్తమైన అధికారులు జమ్ము–శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. దీంతో ఉదంపూర్ వద్ద రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ అధికారులు రోడ్డుపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్నారు.హిమాచల్ ప్రదేశ్‌లోనూ విపరీతంగా మంచు పడుతోంది. లెహ్, స్పితి సహా పలు ప్రాంతాల్లో నిరంతరంగా మంచు వర్షం కురుస్తోంది. దీంతో ఇళ్లు, వాహనాలు, రోడ్లు, చెట్లపై దట్టంగా మంచు పేరుకుపోయింది. ఇక ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో తాజాగా వర్షం కురిసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో పెనుప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం మంచు చరియలు విరిగిపడి బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కు చెందిన సుమారు 57 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఇండియా–చైనా సరిహద్దు ప్రాంతంలోని ఎత్తైన పర్వత ప్రాంతం వద్ద రోడ్డు నిర్మాణం పనిలో కార్మికులు ఉండగా హిమపాతం విరుచుకుపడింది. సమాచారం తెలియగానే పోలీసులు, బీఆర్ఓ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మనా గ్రామానికి సమీపంలో మంచు చరియలు విరిగిపడి కార్మికులు చిక్కుకున్నప్పుడు సమాచారం అందిందని, వెంటనే



ఐడీబీపీ, బీఆర్ఓ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించినట్టు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులందరూ సురక్షితంగా బయపడాలని లార్డ్ బద్రి విశాల్‌ను ప్రార్థిస్తు÷–న్నట్టు చెప్పారు. బీఆర్ఓ వర్క్ సైట్‌ను హిమ చరియలు విరుచుకుపడటంతో ప్రమాదం జరిగినట్టు ఉత్తరాఖండ్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రతినిధి, ఐజీ నీలేష్ ఆనంద్ భర్నే తెలిపారు. నాలుగు అంబులెన్స్‌లను ప్రమాదస్థలికి పంపామని, విపరీతమైన మంచుకారణంగా సహాయక చర్యలకు అంతరాయం కలుగుతున్నట్టు బీఆర్ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీఆర్ మీనా చెప్పారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా అధిగమించి బాధితులను రక్షించేందుకు ఆర్మీ, ఎస్‌డీఆర్ఎఫ్, స్థానిక అధికారులు ఆపరేషన్ సాగిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు,మంచు చరియలు విరిగిపడుతుండటంతో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. మరిన్ని మంచు చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



# టన్నెల్ ఘటన విషాదాంతం

మొదటి పేజీ తరువాయి...

ఒక్క డైరెక్షన్ సక్రమంగా లేదని విమర్శలు వెలువెత్తాయి. మంత్రులేమో పొద్దున్నే వస్తారు.. సాయంత్రానికి వెళ్తున్నారు.. ఘటన జరిగి ఇన్ని రోజులై కార్మికులు చిక్కుకున్నా.. వారిని సురక్షితంగా తీసుకురావాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉందా..? అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిన్న ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

# మామునూరు ఎయిర్‌పోర్టుకు రెక్కలు

మొదటి పేజీ తరువాయి...

లేదని తెలపింది. దీంతో విమానాశ్రయ పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ పరిధిలో 696 ఎకరాల స్థలం ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమి కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్టుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ మేరకు భూసేకర జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో జాతీయ సైన్స్ డే వేడుకలు



ఐఐఆర్ఆర్‌లో జరిగిన సైన్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు



ఐఐఆర్ఆర్‌లో విద్యార్థులు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఐ ఐ ఆర్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం

బుద్వేల్, ఫిబ్రవరి28(ప్రభాత ఉదయం): భౌతిక శాస్త్రానికి కాంతి పుంజమైన రామన్ ఎఫెక్స్ కనుగొన్న రోజైన ఫిబ్రవరి 28న రాజేంద్రనగర్ సర్కిల్ లోని ప్రభుత్వ సంస్థలలో, పాఠశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల చే వివిధ ప్రదర్శనలను చేయించి వారి మేధో శక్తికి పదును పెట్టారు.

### భారత జాతీయ వరి పరిశోధన సంస్థ లో....

వికసిత్ భారత్ నిర్మాణంలో భారత యువతను విజ్ఞాన రంగంలో వినూత్న ఆవిష్కరణలు సాధించే దిశగా ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో రాజేంద్రనగర్ లోని భారత జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) లో శుక్రవారం నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (ఎన్ఎఎఎస్) లతో కలసి ఆ సంస్థ డైరెక్టర్ డాకర్ రామన్ మీనాక్షి సుందరం ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం నిర్వహించారు. ఎనిమిది పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులను ఐఐఆర్రక్కు ఆహ్వానించి వరి పరిశోధన సంస్థలో చేపడుతున్న పరిశోధనల గురిం చి వివరించారు. సైన్స్ లో క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ రైస్ అగ్రిసరి వ్యవస్థాపకులు, ఇన్నోవేటర్ అశోక్ గొర్రె, ఇనిస్టిట్యూట్ ఫర్ ఇండస్ట్రీయల్ ఇంటర్డిసిప్లీనరి రీసెర్చ్ అండ్ ప్రొడక్స్ డవలప్మెంట్ సీఈఓ మౌనిక లు పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మెరుగైన భవిష్యత్తు కోసం తదుపరి తరాన్ని ప్రోత్సహిం చడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తెలిపారు.

### సమాజానికి చైతన్యం చేసేదే శాస్త్రీయత : ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

సమాజంలో అంధకారం ఆవరించినప్పుడు వెలుగులు నింపుతు సమాజాన్ని చైతన్యవంతం చేసే ఏకైక సాధనం శాస్త్రీయత అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. అత్తాపూర్ శ్రీ చైతన్య స్కూల్ లో జరిగిన సైన్స్ డే లో ఆయన పాల్గొని విద్యార్థులు చేసిన ప్రదర్శనలను తిలకించారు. శాస్త్రీయ దృక్పతమే సమాజాన్ని ఉన్నత స్థితికి తీసుకుపోగలదని ఆయన అన్నారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ కు చెందిన శివరామక్రిష్ణ, పుష్ప, శ్రీకాంత్, అనిత లు పాల్గొన్నారు.



బాబుల్ రెడ్డి నగర్ శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ లో జరిగిన సైన్స్ ఫెయిర్ లో పాల్గొన్న డీఆర్‌డీవో సైంటిస్ట్ ఉమా శంకర్

### విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, అలోచన శక్తిని వెలికి తీయాలి: డీఆర్ డీవో శాస్త్రవేత్త ఉమా శంకర్

బాబుల్ రెడ్డినగర్ లోని శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ లో జరిగిన సైన్స్ ఫెయిర్ లో డీఆర్డీఓ శాస్త్రవేత్త ఉమా శంకర్ పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. సైన్స్, అగ్రికల్చరల్, ఇన్నోవేషన్స్, రోబోటిక్ రంగాలలో విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలను ఆమె మెచ్చుకున్నారు. అయితే ఈ ప్రదర్శనలు, సైన్స్ ఫెయిర్ లు చేసినప్పుడే విద్యార్థులకు అవగాహన కల్పించే బదులు నిరంతరం శాస్త్రీయ కోణంలో విద్యాబోధన చేపడితే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు ఎం. ప్రభాకరచారి, జి.శరవణ్ కుమార్, ఎస్.ఆర్ రజనీకాంత్, పి.శోభారాణి, పి.ఆనంద్, టి.ప్రకాశౌసింగ్, మహ్మద్ వాజీద్, మదుసూదన్ రావు, ఏపీ చారి, మహ్మద్ రఫీక్, ఎం.నరేందర్, జి.బజారన్న, జి.యాదయ్య, ప్రవీణలు పాల్గొన్నారు.

### శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో-

శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుటు కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో సైన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శంకర్ రాథోడ్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీదర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఎంఈఓ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ, సీవీ రామన్ గొప్ప భౌతిక శాస్త్రవేత్త అని అయనను ఆదర్శంగా తీసుకుని బాలబాలికలు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సుదర్శన్, సరళమ్మ, వసుందర, కరుణాకర్, సురేశ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీదేవి, సునీత, ఎట్టప్ప, సులక్షణ, రత్నప్రభ, మాధవి, పాఠశాల ఉపాధ్యాయులు జనార్ధన్ చారి, వెంకటయ్య, ఆంజయ్య, మె గులయ్య, సుదాకర్, అనురాధ, రూపాదేవి, మహేశ్వరీ, యామిని, ప్రమీద, ఉదయలక్ష్మీ, పద్మ, కవిత, సంధ్య, ఉదయశ్రీ, రిజ్వానా, పుష్పలత లు పాల్గొన్నారు.

### రూత్ మెమోరియల్ స్కూల్ లో...

హప్పీ హొమ్స్ కాలనీలో గల రూత్ మెమోరియల్ స్కూల్ లో జరిగిన సైన్స్ డే లో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ ఎం.ఆగస్టిన్ లు పాల్గొని విద్యార్థులు చేసిన సైన్స్ ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు తాము చూస్తున్న ప్రతి అంశాన్ని ప్రశ్నించే విదంగా ఉన్నప్పుడే ఎక్కువ విజానాన్ని పొందుకుంటారన్నారు. ఈ కార్యక్రమం లో గాస్పెల్ ట్రంపెట్స్ మినిస్ట్రీస్ కు చెందిన డాక్టర్ జి.విజయభూషణం, డాక్టర్ ప్యాట్రిక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో జరిగిన సైన్స్ ఫెయిర్ లో పాల్గొన్న ఎం ఈ ఓ శంకర్ రాథోడ్



అత్తాపూర్ శ్రీ చైతన్య స్కూల్‌లో జరిగిన సైన్స్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్





రూత్ మెమోరియల్ స్కూల్‌లో జరిగిన సైన్స్ డే లో పాల్గొన్న ఎం ఈ ఓ శంకర్ రాథోడ్, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్స లెన్స్ ప్రిన్సిపాల్ ఎం అగస్టీన్



శాంతి నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## శాంతినగర్, అయ్యప్ప స్వామీ దేవాలయం పరిసరాలలో పనులు చేపట్టండి

బుద్వేల్, ఫిబ్రవరి28 (ప్రభాత ఉదయం): శాంతినగర్ అయ్యప్ప స్వామి దేవాలయం వరిసర ప్రాంతాలలో నూతన పైపులైన్, సీసీ రోడ్డు పనులు చేపట్టాలని మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం మైలార్దేవుపల్లి డివిజన్ శాంతినగర్ వరిసర కాలనీలలో ఆయన అధికారులతో కలసి పర్యటించారు. అయ్యప్ప స్వామీ దేవాలయం పరిసర ప్రాంతాలలో డ్రైనేజీ పైప్లైన్, మంచినీటి పైప్ లైన్ తో పాటు సీసీ రోడ్డు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రేణుక, ఇంజనీరింగ్ విభాగం ఏఈ నర్సింహ్మమూర్తి, నాయకులు నర్సిరెడ్డి, రమేశిరెడ్డి, రాజు, తలారి చిన్న, కొండల్ ముదిరాజ్, అంజి, మహ్మద్ , పాం డు యాదవ్, శంకర్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలతో విలువైన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించిన మహిళ అరెస్ట్

బుద్వేల్, ఫిబ్రవరి28(ప్రభాత ఉదయం): నకిలీ దస్తావేజులతో రూ.7 కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ఓ మహిళను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ఈ కేసులో మరికొందరు పరారీలో ఉన్నారని ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు. బం డ్లగూడ పద్మశ్రీ హిల్స్ కాలనీలో 600 గజాల స్థలం నగరంలోని ఓ మహిళ గతంలో కొనుగోలు చేసింది. ప్రస్తుతం అక్కడ గజం స్థలం రూ.1.25 లక్షలు పలుకుతుతుంది. ఆ స్థలంపై కన్నేసిన నాగోల్ కు చెందిన సుభాషిణీ అనే మహిళ నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి స్థలం కబ్జా చేసేం దుకు ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న స్థల యజమానురాలు రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేసిన తర్వాత నకిలీ పత్రాలతో విలువైన స్థలం కబ్జాచేయడానికి ప్రయత్నించిన సుబాషిణీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్/బండ్లగూడ/శంషాబాద్, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. బ్లాక్ చర్చి విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్, ఎస్ ఎం ఎంక్లేవ్1,2, సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, కీర్తి విల్లాస్, డిఫెన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు ఆర్ వి నిర్మాణ్, ట్రంప్ విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్ కి విల్లా, ఖాదర్ ఎన్నారై, ఎల్వీ ప్రసాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు కె టి టి కాలనీ, శ్రీ బాలాజీ ఎంక్లేవ్, రాజా క్షేత్ర, గిరిదారి, గిరిదారి విస్టా, దర్గా కలుస్తాన్, ఎల్వీ ప్రసాద్, కీర్తి విల్లా స్, నమః మ్యాప్ హార్ కన్స్ట్రక్షన్, 80 ,60 యార్డ్స్, ప్రాంతాలలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### హిమాయత్ సాగర్ లో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 12:30 నుండి 2:00 వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం పీరంచెరువు, వాసతి ఆనంది అపార్ట్మెంట్, గిరిదారి అపార్ట్మెంట్స్, ఎంపైర్ డెల్టా విల్లాస్, షాదన్ కాలేజ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు.

### శివరాంపల్లి లో...

శివరాంపల్లి విద్యుత్తు సెక్షన్ పరిధిలో గల యూనివర్సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం రెండున్నర నుండి మూడు గంటల వరకు గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ, బెస్ట్ ప్రైస్, ఖాదర్ హిల్స్, మధ్యాహ్నం రెండు గంటల నుండి 2:30 వరకు హాసన్ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన అసన్ నగర్, బాబా నగర్, ఇంద్రానగర్, ఎన్టీఆర్ నగర్, శ్రీదేవి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి మూడున్నర వరకు వీకర్ సెక్షన్ కాలనీ, శ్రీదేవి కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంత రాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయం సహకరించాలని ఆయన కోరారు.

### మైలార్ దేవ్ పల్లి లో...

మైలార్ దేవ్ పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం బృందావన్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన బృందావన్ కాలనీ, ప్రగతి కాలనీ, టాటా నగర్, మొగల్స్ కాలనీ లలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు, క్రిస్టల్ టౌన్, రహమత్ కాలనీ, మొగల్ కాలేజ్, వాదియి ఫర్హాన్ కాలనీ, సుభాన్ హిల్స్, ప్రాంతాలలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### శంషాబాద్‌లో...

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ మరమత్ల నిమిత్తం శంషాబాద్, ఎమ్మార్వో ఆఫీస్, నక్షత్ర విల్లా స్, సీఎస్కే కాలనీ, ఆర్ బి నగర్, రాఘవేంద్ర కాలనీ, శ్రీ బాలాజీ టౌన్షిప్, రాల్లగూడ, ప్రకాష్ నగర్, యాదవ్స్ కాలనీ, ఫోర్టు గ్రాండ్, కోత్వాల్ కూడా, మధురానగర్ కాలనీ, శ్రీనివాస కాలనీ, ఆదర్శనగర్, రిజిస్ట్రేషన్ ఆఫీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు

### పలువురు జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)జిల్లావ్యాప్తంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. పలువురు జూనియర్ అసిస్టెంట్లను సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ లు కల్పిస్తూ బదిలీలు చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఉత్తర్వులు జారీచేశారు. అందులో వెంకటేశ్వర్లు (కలెక్టరేట్ నుంచి ఆర్డీఓ), కర్నం నగేష్ (ధరూర్ నుంచి గద్వాల తహసీల్దార్ కార్యాలయం), ఎండి సికిందర్ (గద్వాల తహసీల్దార్ కార్యలయం నుంచి కలెక్టరేట్), దుర్గాసింగ్ (గద్వాల తహసీల్దార్ ఆఫీస్ నుంచి అలంపూర్ తహసీల్దార్ ఆఫీస్), బి.ఆంజనేయులు (వద్దేపల్లి నుంచి అలంపూర్), కరీం (అలంపూర్ కార్యాలయం నుంచి మల్దకల్), నాగిరెడ్డి (మల్దకల్ నుంచి గట్టు), టి.క్రిష్ణ (గట్టు నుంచి ఆర్డీఓ కార్యాలయం), సర్దార్ మియా (మానవపాడు నుంచి వద్దేపల్లి), తిరుమలేష్ (కలెక్టరేట్ నుంచి అయిజ), ఎన్.మద్దిలేటి (అయిజ నుంచి మల్దకల్), మద్దిలేటి(మల్దకల్ నుంచి రాజోలి), కిరణ్ కుమార్ (అయిజ తహసీల్దార్ కార్యాలయం నుంచి గద్వాల ఆర్డీఓ కార్యాలయం)కు బదిలీ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

#### జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

గద్వాల జిల్లాలో పనిచేస్తున్న ఏడు మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తూ బదిలీ చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. వద్దేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఎండి షేక్షావలి సీనియర్ అసిస్టెంట్ గా పదోన్న తి ఇస్తూ అయిజ తహసీల్దార్ కార్యలయాలనికి బదిలీ చేశారు. అయిజలో పనిచేస్తున్న టైపిస్ట్ యు.బాబుకు సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి కల్పిస్తూ మానవపాడుకు బదిలీ చేశారు. కలెక్టరేట్ లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఎం.మహేందర్ కు సీనియర్ అసిస్టెంట్ గా కలెక్టరేట్ డి సెక్షన్ కు బదిలీ చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో టైపిస్ట్ క్యామ నగేష్ సీనియర్ అసిస్టెంట్ గా కలెక్టరేట్ ఎ- సెక్షన్ కు బదిలీ చేశారు. ఆర్డీఓ ఆఫీస్ లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న భరత్ కుమార్ అయిజకు బదిలీ చేశారు. కలెక్టరేట్ లో టైపిస్ట్ గా పని చేస్తున్న వి.నర్సింహులు ధరూర్ కు, కలెక్టరేట్‌లో టైపిస్ట్ గా పని చేస్తున్న లక్ష్మీ బాయి సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి కల్పిస్తూ కలెక్టరేట్ కు బదిలీ చేశారు.



అపరేషన్ చేయించుకున్న బాలునితో కలసి వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్లు



కాలు వ్రేలు తీసి కుడి చేతి బ్రొటన వ్రేలు వేసిన డాక్టర్లు

## కాలు వ్రేలు తీసి కుడి చేతి బ్రొటన వ్రేలుకు అమర్చిన డాక్టర్లు

బుద్వేల్, ఫిబ్రవరి28(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ జర్మంటైన్ హాస్పిటల్ లో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసారు. ఆ వివరాలను శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జర్మంటైన్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మీర్ జవాద్ జార్ ఖాన్ వెల్లడించారు. పచ్చిమ బెంగాల్ కు చెందిన రషీద్ మియ(11) కు మూడు సంవత్సరాల క్రితం బాణసంచా కాలుస్తుండగా రెండు చేతుల వ్రేలు తెగిపోయాయి. దీంతో ఆ బాలుడు చాలా ఇబ్బందులకు గురైనాడు. తినడానికి, తన పనులు చేసుకోవడానికి, వ్రాయడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ బాలుని తల్లిదండ్రులు అత్తాపూర్ జర్మంటైన్ ఆసుపత్రిలో చేతివేళ్లను అమర్చడం, ఎముకలకు సంబందించిన శస్త్రచికిత్సలు బాగా చేస్తారని తెలుసుకుని సంప్రదించగా దాతల సహకారంతో రషీద్ మియ కు శస్త్రచికిత్స చేయడం జరిగిందన్నారు. రషీద్ మియా కుడి కాలు రెండవ వ్రేలు ను తీసి కుడి చెయ్యి బ్రొటన వ్రేలుకు అమర్చడం జరిగిందన్నారు. ఈ శస్త్ర చికిత్సకు 15 గంటల సమయం పట్టిందన్నారు. శస్త్ర చికిత్సకు ముందు అనస్తీషియా డాకర్ డాక్టర్ కృపాకాంత్ ఎంతో చాకచక్యంగా చేతి వరకు మత్తు ఇచ్చి, శస్త్ర చికిత్స జరపడానికి సహకరించాడన్నారు. ఇలాంటి శస్త్ర చికిత్స చేయడం తెలంగాణలోనే మొదటి సారి అన్నారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ శ్యామసుందర్, డాక్టర్ మీర్ ఖాలేద్ అలీ, డాక్టర్ సందీప్ శ్రీరామ్, డాక్టర్ మిథూన్. డాక్టర్ రాజశేఖర్ లు పాల్గొన్నారు.



కృష్ణ కిషోర్‌ను సన్మానించి మెమోంటో బహుకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్



ధనపతిని సన్మానిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్

## పదవీ విరమణ పొందిన వారికి సన్మాణం

బుద్వేల్, ఫిబ్రవరి28(ప్రభాత ఉదయం): ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజ పరిణామం అని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్ అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఆఫీస్ సబార్డినేట్గా పనిచేస్తు పదవీ విరమణ పొందిన ధనపతి కుటుంబ సభ్యులను శుక్రవారం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్ శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. విశ్రాంత జీవితం సుఖ సం తోషాలతో గడపాలని కోరారు.

### రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో...

రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో 14 సంవత్సరాల పాటు శానిటరీ సూపర్వైజర్ గా పని చేసిన క్రిష్ణ కిషోర్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. అయనను డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. క్రిష్ణ కిషోర్ మృదు స్వభావి అని కొనియాడారు. ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో కళకళ లాడుతు ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు.

# ప్రజల నుండి అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలు అవాస్తవం

## అధికారుల పట్ల ఎమ్మెల్యే వైఖరి మారాలి

## ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాధిరెడ్డి యుగంధర్ రెడ్డి



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తున్నాడని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం చేసిన ఆరోపణలు అవాస్తవమని, అంత దౌర్భాగ్య పరిస్థితి పట్ల లేదని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కూకట్ పల్లి హౌసింగ్ బోర్డులో పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలను చూడగానే ఒక రకమైన అసహనానికి గురవుతున్నాడని, తపన కోపాన్ని అమాయకులైన అధికారులపై అక్కసును వెళ్ళగక్కుతున్నాడని తీవ్రంగా విమర్శించాడు. అధికారులపై ఎమ్మెల్యే ధోరణి ఇలాగే ఉంటే అధికారులు ఎమ్మెల్యేపై తిరగబడడం ఖాయమన్నారు. పొద్దున నుండి రాత్రి వరకు, పండగ పబ్బాలు అనకుండా, ఎప్పుడూ పిలిస్తే అప్పుడు వస్తున్నందుకు అధికారులు ఎమ్మెల్యేకు చులకన అయ్యారని అన్నారు. ఎలా పడితే అలా తిడితే అధికారుల మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు.



హైదర్ గూడలోని దేవాదాయ శాఖ భూముల్లో బోర్డు పాతిన అదికారులు



ఫెన్సింగ్ ఏర్పాటు

# రూ.250 కోట్ల విలువ చేసే దేవాదాయ శాఖ భూముల చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు

బుద్వేల్, ఫిబ్రవరి28 (ప్రభాత ఉదయం): అత్తాపూర్ రాంబాగ్‌లో గల శ్రీ అనంతపద్మనాభ స్వామీ దేవాలయానికి చెందిన 4.22 ఎకరాల దేవదాయ ధర్మదాయశాఖ కు చెందిన భూములను స్వాధీనం చేసుకున్న రంగారెడ్డి జిల్లా దేవదాయ శాఖ అధికారులు శుక్రవారం ఆ భూమి చుట్టు ఫెన్సింగ్ వేసి బోర్డు పాతారు. స్వాధీనం చేసుకున్న దేవదాయశాఖ భూముల విలువ రూ.250 కోట్లకు పైగానే ఉంటుంది. వివరాలను రంగారెడ్డి జిల్లా దేవాదాయశఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ వెల్లడించారు. అత్తాపూర్ సర్వే నెంబర్ 435, 446 లో శ్రీ అనంత పద్మనాభ స్వామీ దేవాలయానికి హైదర్ గూడ జనప్రియ హితోపియ పక్కన 4.22 ఎకరాల భూమి ఉండేదని, అయితే ఆ భూములను కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని యాభై సంవత్సరాలుగా తమ ఆధీనంలో పెట్టుకున్నారన్నారు. ఆ భూముల విషయంలో సుప్రీకోర్టు వరకు వెళ్లడం జరిగిందన్నారు. చివరకు అవి దేవదాయశాఖ కు చెందినవే అని కోరు తీర్చు ఇవ్వడంతో జనవరి 9వ తేదీన ఆ భూములలో ఉన్న నిర్మాణాలను, షెడ్లను తొలగించడం జరిగిందన్నారు. రంగారెడ్డి జిల్లా కలెకర్ నారాయణరెడి నేతృత్వంలో గురువారం రాజేంద్రనగర్ తహసీల్దార్ బి రాములు సహకరాంతో దేవదాయశాఖ భూములను సర్వే చేశామని, అట్టి భూములలో శుక్రవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డులు పాతడం జరిగిందన్నారు.

### దేవదాయశాఖ అధికారులను అభినందిస్తున్న ప్రజలు :

అత్తాపూర్ రాంబాగ్ లో గల వివిధ దేవాలయాలకు సంబంధించి ఉన్న భూములను కాపాడటం లో దేవదాయ శాఖ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని స్థానికులు అంటున్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ లో ప్రస్తుతం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న భూమి ఎకరాకు రూ.60 కోట్లు పలుకుతుందన్నారు. గతంలో అనంత పద్మనాభ స్వామీ దేవాలయానికి చెందిన భూములను కూడా దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రహరి నిర్మించారన్నారు. ఇటీవల తేజస్వీని కాలనీలో ఓ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారన్నారు. అత్తాపూర్ పరిసరాలలో దేవాదాయ శాఖ భూములు చాలానే ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత దేవదాయ శాఖతో పాటు ప్రభుత్వంపై ఉందన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్

# డిఈ దామోదర్ రావు విధినిర్వహణ స్ఫూర్తిదాయకం: సిజిఎం పాండ్యా

## డిఇ దామోదర్ రావు పదవీ విరమణ కార్యక్రమంలో ఘనంగా సన్మానం




డి ఈ దామోదర్ రావు పదవి విరమణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిజిఎం పాండ్యా




పదవి విరమణ పొందిన దామోదర్ రావును సన్మానిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఇ శ్రీరామ్మోహన్,

మెహదీపట్నం, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం) డి ఈ బాజీ దామోదర్ రావు విధి నిర్వహణ స్ఫూర్తిదాయకమని, సౌమ్యుడిగా సంస్థలు మంచి పేరు తెచ్చుకున్నారని టీజీ ఎస్పీడీసీఎల్ ఆర్ జోన్ సిజిఎం పాండ్యా అన్నారు. శుక్రవారం మెహిదీపట్నంలోని కినెర ఫంక్షన్ హాల్ లో సైబర్ సిటీ సర్కిల్ ఎస్ ఇ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) బాజీ దామోదర్ రావు పదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాండ్యా మాట్లాడుతూ... విద్యుత్ సంస్థలో అధికారి, ఉద్యోగి కి విధి నిర్వహణ సవాలుగా ఉన్నప్పటికీ దామోదర్ రావు ఎంతో సమన్వయంతో తన ఉద్యోగ జీవితాన్ని పూర్తి చేసుకున్నారన్నారు. ఆయన చేసే జీవితం ఆరోగ్యం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిజిఎంలు చక్రవర్తి, ఎస్ ఈ లు వెంకన్న, డి శ్రీరామ్మోహన్, గోపయ్య, ఎస్ ఏ ఓ ఎంపీ రవికుమార్, జిఎం తులసి, డివిజినల్ ఇంజనీర్లు గోపాలకృష్ణ, రాజారాం రెడ్డి, స్వామి, విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం అధినేత ఎం భాస్కర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు మేడి రమేష్, రవీందర్, రాజేంద్రనగర్ సర్కిల్ అకౌంట్స్ ఆఫీసర్ (రెవెన్యూ) శేఖర్, సైబర్ సిటీ సర్కిల్ అకౌంట్ ఆఫీసర్ (రెవెన్యూ) మనోహర్, పవర్ డిప్లొమా ఇంజనీర్ అసోసియేషన్ నాయకులు బీసీ రెడ్డి, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు మురళి గౌడ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ చరణ్ నేతృత్వంలో డిఇ దామోదర్ రావు పదవీ విరమణ కార్యక్రమానికి ఏర్పాట్లు నిర్వహించారు. డి ఈ దామోదర్ రావు గ్రామస్తులు ఆయన తండ్రి బాజీ హనుమంతు ఎమ్మెల్యేగా నిస్వార్థ సేవలందించారని ఆయన మార్గంలో విద్యుత్ శాఖలో దామోదర్ రావు చేసిన సేవలను అధికారులు కొనియాడడం తమకు సంతోషంగా ఉందన్నారు.



పదవి విరమణ పొందిన డి ఈ దామోదర్ రావు ను మోకిల విద్యుత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్లతో కలిసి సన్మానిస్తున్న ఏ డి ఈ మేడి రమేష్




డిఈ దామోదరావు పదవీ విరమణ చేసిన సందర్భంగా సన్మానించిన 1104 యూనియన్ నేత ఎం భాస్కర్ రెడ్డి, పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకుడు తాజుద్దీన్





# కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళాలు అందజేత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం)కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రాయచూరు జిల్లా యరమొర్సు గ్రామానికి చెందిన సిద్దప్ప రూ.65,000, అదే విధంగా రాంపురం గ్రామానికి చెందిన డి.భాస్కర్ రూ. 50,000 నగదును విరాళాలుగా అందజేశారు. అనంతరం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దాతలు దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని శేష వస్త్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆలయాల్లో అమావాస్య పూజలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి28(ప్రభాత ఉదయం)జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీఆంజనేయ స్వామి ఆలయం,మల్దకల్ శ్రీస్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం, బీచుపల్లి శ్రీఆంజనేయ స్వామి ఆలయం, తదితర ప్రసిద్ద ఆలయాల్లో అమావాస్య సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తు లు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కేటిదొడ్డి, ధరూర్ మండల కేంద్రంతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు, కర్ణాటక ప్రజలు పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయాల్లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



### కన్నుల పండువగా స్వామీ వారి కళ్యాణోత్సవం

కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహెూత్సవం కన్నుల పండువగా కొనసాగింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అభి షేకం, దీక్షా హెూమం, శాంతిహెూమం, పూర్ణాహుతి, చక్ర స్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంత రం అలివేల మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు.





# పెబ్బేర్ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## ఒకరు మృతి

పెబ్బేరు, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం) రెండు కార్లు పరస్పరం ఢీకొని సంఘటనలో ఒకరు మృతి చెందారు. కార్లు అదుపుతప్పి ప్రైవేట్ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న 30 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలోని రంగాపూర్ బైపాస్ వద్ద నేషనల్ హైవేపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరుకు చెందిన ముష్టి విష్ణు(35), తన కుటుంబంతో మరో కారులో 8 మంది మహబూబ్ నగర్ కు వైపు వెళ్తున్నారు. అదేవిధంగా హైదరాబాద్ లోని వనస్థలిపురానికి చెందిన ఓ పెళ్లి బృందం 40 మంది ప్రైవేటు ట్రావెల్స్ లో తిరుపతికి వెళ్తున్నారు. పెబ్బేరు సమీపంలోని రంగాపూర్ బైపాస్ లో నేషనల్ హైవే 44పై మహబూబ్ నగర్ వైపు వెళ్తున్న రెండు కార్లు పరస్పరం ఢీకొట్టుకోగ,... కార్లు డివైడర్ పైకి ఎక్కి తిరుపతి వైపు వెళు తున్న పెళ్లి బస్సును ఢీ కొట్టాయి. దీంతో బస్సు డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పెబ్బేరు పట్టణానికి చెందిన ముష్టి విష్ణు(35) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య పరిస్థితి విషమంగా ఉంది. కుమారుడికి కాలు విరగగా.. ఇద్దరు కుమార్తెలు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. అదేవిధంగా మరో కారులో సైతం 8 మందితో వెళ్తున్న కుటుంబ సభ్యులు కూడా గాయాలపాలయ్యారు. బస్సులో తిరుపతికి వెళ్తున్న 30 మంది తీవ్రగాయాల పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన నేషనల్ హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ముష్టి విష్ణును, క్షత గాత్రులను హైవే, 108 అంబులెన్సుల ద్వారా వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న పెబ్బేరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608